క్లుప్తంగా

ముగిసిన బైబిల్ శిక్షణా తరగతులు


బైబిల్‌లో శిక్షణ పొందిన చిన్నారులతో పాస్టర్ విజయకుమార్

సైదాపురం : వేసవి సెలవుల నేపథ్యంలో సైదాపురంలోని సెయింట్ లూథరన్ చర్చిలో నిర్వహించిన బైబిల్ శిక్షణా తరగతులు ముగిశాయి. ఆదివారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆరాధన కార్యక్రమం చేపట్టారు. పాస్టర్ విజయకుమార్ దైవ సందేశం ఇచ్చారు. అనంతరం యువతీ యువకులు ఆలపించిన గీతాలు అందరిని ఆకట్టుకున్నాయి. బైబిల్ శిక్షణ పొందిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. బహుమతులు అందించారు. కార్యక్రమంలో చర్చి పెద్దలు స్నేహలత, పురుషోత్తం పాల్గొన్నారు.

కండలేరులో 41.809 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 41.809 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,880, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

రక్షణ గోడను ఢీకొన్న కారు

- ముగ్గురికి తీవ్ర గాయాలు


రక్షణ గోడను ఢీకొన్న కారు, పక్కన గాయపడిన మహిళ

వాకాడు : వాకాడులోని శివాలయం వద్ద ఆదివారం కారు అదుపుతప్పి స్వర్ణముఖి నది పక్కన రోడ్డులో ఏర్పాటుచేసిన రక్షణ గోడను ఢీకొంది. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. తిరుపతికి చెందిన 9 మంది రెండు కార్లలో తూపిలిపాళెం బీచ్‌కు వచ్చారు. అక్కడ సరదాగా గడిపారు. సాయంత్రం తిరుపతికి వెళ్లే క్రమంలో ఒక కారు స్వర్ణముఖి నది పక్కన రోడ్డులో ఏర్పాటుచేసిన రక్షణ గోడను ఢీకొంది. దీంతో ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు వాకాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కుమ్మరిగుంటలో కుక్కల స్వైర విహారం


క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న వైద్యులు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని కుమ్మరిగుంట గిరిజన ప్రాంతంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం కుక్కల దాడిలో పలువురు చిన్నారులు గాయపడ్డారు. వారికి చెవిరెడ్డిపల్లి పీహెచ్‌సీ వైద్యులు రవితేజ, సిబ్బంది చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు చిన్నారులను నెల్లూరు తరలించారు. పట్టణంలోని పలు వార్డుల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, అధికారులు దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని నాలుగో వార్డు కౌన్సిలర్ ఎంఏ నారాయణ కోరుతున్నారు.


పిల్లలను పరామర్శిస్తున్న కౌన్సిలర్ నారాయణ

నదిలో పడి వ్యక్తి గల్లంతు

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట పట్టణంలోని చెంగాళమ్మ ఆలయం వద్ద ఉన్న కాళంగి నది వంతెనపై ఆదివారం సాయంత్రం బైక్‌పై వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి అదుపుతప్పి నదిలో పడి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరు కుని గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి చికటి కావడంతో గాలింపు చర్యలను ఆపేశారు. గల్లంతైన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు పౌరాణిక, సాంఘిక నాటకాల ప్రదర్శన

తిరుపతి కల్చరల్ : కళాక్షేత్రంలో మంగళవారం పౌరాణిక, సాంఘిక నాటకాల ప్రదర్శన చేపట్ట నున్నట్టు సుబ్బరాజు నాట్య కళాపరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అంతరించిపోతున్న కళలకు పూర్వ వైభవం తీసుకురావాలనే సంకల్పంతో తమ సంస్థ ప్రతి నెలా నాటకాల ప్రదర్శన చేపడుతోందన్నారు. ఇందులో భాగంగానే మంగళవారం సాయంత్రం 5 గంటలకు మహతిలో 'తరమెళ్లిపోతోంది', 'లవకుశ' నాటకాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

పున్నమికి వెలుగేది..?

- నిరుపయోగంగా మారిన పున్నమి హోటల్
- ఆకతాయిల చేతుల్లో పగిలిపోతున్న అద్దాలు
- చీకటి కార్యకలాపాలకు నిలయంగా మారిన వైనం


డీవీ సత్రంలో ఎంతో అందగా నిర్మించిన పున్నమి రెస్టారెంట్

దొరవారిసత్రం : దొరవారిసత్రం మండల కార్యాలయాలకు ఆనుకుని రోడ్డు పక్కన 2001–02లో నిర్మించిన పున్నమి రెస్టారెంట్ నిరుపయోగంగా మారింది. రూ.కోట్లతో నిర్మించిన భవనాలు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ఆకతాయిలు, మందు బాబులకు నిలయంగా మారింది. రెస్టారెంట్, షాపింగ్‌లోని ఫ్యాన్లు, విద్యుత్ సామగ్రి చోరీకి గురయ్యాయి. అద్దాలను పగులగొట్టారు. పున్నమి రెస్టారెంట్ ఆవరణలో చిన్నపిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటుచేసిన వస్తువులు కనుమరుగయ్యాయి. ఆవరణం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. రెస్టారెంట్‌లోని వాటర్ ఫౌంటెన్ దెబ్బతినింది. ఇక్కడున్న విద్యుత్ మోటార్లు సైతం చోరీకి గురయ్యాయి. ఇంతజరుగుతున్నా టూరిజం శాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. జనవరిలో సూళ్లూరుపేట కేంద్రంగా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పక్షుల పండుగ సమయంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పున్నమి రెస్టారెంట్‌ను వినియోగంలోని తీసుకువస్తామని హామి ఇచ్చారు. నెలలు గడుస్తున్నా ఆ ఊసే లేదు.



రెస్టారెంట్ వద్ద పిచ్చిమొక్కలతో నిండిన గ్రీన్‌బెల్ట్, నిరుపయోగంగా వాటర్ ఫౌటెన్, నిరుపయోగంగా షాపింగ్ కాంప్లెక్స్


రెస్టారెంట్‌లో పగిలిపోయిన అద్దాలు


పున్నమి ఆవరణలో వేసిన ఫుట్‌పాత్

ఆక్రమణలో సుబ్బన్న గుంట


సుబ్బన్న గుంటలో మట్టి తోలి ఎత్తు చేస్తున్న ఆక్రమణదారులు

చిల్లకూరు : మండలంలోని ముత్యాలపాడు పంచాయతీలో వున్న సుబ్బన్న గుంటను ఆదివారం కొంతమంది ఆక్రమించుకుని మట్టి తోలి చదును చేశారు. గ్రామాల్లో పంటలు పండించుకోవడంతో పాటు భూగర్భ జలాలు పెరిగేందుకు పూర్వీకులు పలుచోట్ల గుంతలు తవ్వారు. ప్రస్తుతం అవి నీటి పారుదల శాఖ పరిధిలో వున్నాయి. వాటి గురించి అధికారులు పట్టించుకోలేదు. గ్రామస్తులు గ్రామ సభల్లో ఉపాధి హామీ కింద వాటిలో పూడికతీత పనులు చేసుకుని బాగు చేసుకుంటున్నారు. ఇలా ముత్యాలపాడు పంచాయతీలో సుబ్బన్నగుంట, అయ్యోరి గుంట, సంద్రగుంట, మోదుగుల గుంట, కుమ్మరగుంటను బాగు చేసుకున్నారు. అవి ఒక్కొక్కటి మూడు ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉన్నాయి. తద్వారా వర్షాకాలంలో వర్షపు నీరు నిలిచి భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గుంటలపై నేతల కన్నుపడింది. రాత్రికిరాత్రే మట్టితోలి చదును చేస్తున్నారు. సంద్రగుంటలో మట్టి తవ్వకాలు చేపట్టడంతో అది రూపు రేఖలు కోల్పోయి ఎందుకూ పనికి రాకుండా పోయింది. ఇప్పుడు సర్వే నంబర్ 417లోని 3.60 ఎకరాల విస్తీర్ణంలో వున్న సుబ్బన్న గుంటలో మట్టి తోలి చదును చేసి ఆక్రమించుకుంటున్నారు. దీనిపై నీటి పారుదల శాఖాధికారులు కన్నెతి కూడా చూడకపోవడంతో ఆక్రమణదారులకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఇలా అన్ని గుంటలను ఆక్రమించుకుంటూ పోతే భవిష్యత్తులో తాగునీటి సమస్య తప్పదని గ్రామస్తులు వాపోతున్నారు. ఆక్రమణల విషయంపై నీటిపారుదల శాఖ ఏఈ ఫరూఖ్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

అధ్వానంగా సైదాపురం-పొదలకూరు రోడ్డు



సైదాపురం : సైదాపురం–పొదలకూరు రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ మార్గం నుంచి నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రోడ్డు అంతా గుంతలమయమైంది. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు నిలుస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ బీఈడీ కళాశాలలో 1986–87లో బీఈడీ చేసిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఎక్కడెక్కడో స్థిరపడిన అందరూ రావడంతో సందడి నెలకొంది. వారు ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల ఉన్నతికి తమ వంతు కృషి చేస్తామన్నారు. తమ గురువులను సన్మానించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అదేవిధంగా చిట్టేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990–91లో పదో తరగతి చదివిన విద్యార్థులు సమావేశమయ్యారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సంపత్‌కుమార్‌రెడ్డి, ఇలియానా, నిర్మలాదేవి, శ్రీనివాసులును సన్మానించారు.


కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ బీఈడీ కళాశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

అపూర్వ కలయిక

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలోని గోగినేని వెంకటసుబ్బానాయుడు ఉన్నత పాఠశాలలో 1997–98లో పదో తరగతి చదివిన వారు ఆదివారం సమావేశమయ్యారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. స్నేహితులతో ఆనందంగా గడిపారు. తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. తాము ఈ స్థితికి కారణమైన పాఠశాలకు చేయూత ఇస్తామని పేర్కొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కలువాయి(సైదాపురం) : కలువాయి మండలం కుల్లూరులో ఆదివారం మండల స్థాయి కుల్లూరు ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. పోటీలను నిర్వాహకులు నరాల సునీల్, చల్లా రాజేష్‌రెడ్డి, గుంజి రవి ప్రారంభించారు. ఇందులో 20 జట్లు పాల్గొననున్నట్టు తెలిపారు.

పలుచోట్ల మోస్తరు వర్షం


సైదాపురం : కురుస్తున్న వాన

సైదాపురం : మండలంలో ఆదివారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం 10 గంటల నుంచి ఎండ తీవ్రంగా కాయడంతో ప్రజలు అల్లాడారు. మధ్యాహ్నం ఉన్నట్టుండి వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని మేఘాలు కమ్ముకున్నాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. నిమ్మ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గూడూరులో వర్షం

చిల్లకూరు : గూడూరు, చిల్లకూరు మండలాల్లో ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వర్షం కురవడంతో ప్రజలు కొంత ఉపశమనం పొందారు. ఎడగారు పంటలు సాగు చేసే రైతులకు వర్షం కొంత ఊరటనివ్వగా, ఇటుక బట్టీల నిర్వాహకులకు తీవ్ర నష్టం కలిగించింది.

కమ్ముకున్న కారుమబ్బులు

ఓజిలి: నైరుతి రుతుపవనాలు కేరళను తాకిన నేపథ్యంలో ఆదివారం ఆయంత్రం ఓజిలి మండలంలో వాతావరణంలో మార్పులు సంభవించాయి. ఒక్కసారిగా ఆకాశం కారు మబ్బులు కమ్ముకుని తేలికపాటి వర్షం కురిసింది. అప్పటి వరకు ఎండ, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు చల్లని గాలులకు ఉపశమనం పొందారు.

వర్షపు నీటితో తిప్పలు

మండల కేంద్రమైన ఓజిలి సాయిబాబా మందిరం వద్ద కూడలిలో వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే ఇక్కడ పెద్ద ఎత్తున నీరు నిలుస్తోంది. ఆర్‌అండ్‌బీ రోడ్డు కింద భాగంలో ఉన్న తూములు చిన్నవిగా ఉండటంతో మట్టి, ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయి వర్షపు నీరు ప్రవహించడం లేదు. ఈ మార్గంలో నిత్యం ఆటోలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వర్షపు నీరు సక్రమంగా వెళ్లేలా చూడాలని పంచాయతీ పాలకులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై నాయుడుపేట ఆర్‌అండ్‌బీ డీఈ పరమేశ్వరి మాట్లాడుతూ రోడ్డుపై వర్షపు నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చిన్నపాటి వర్షానికే జలమయం

సైదాపురం: చిన్నపాటి వర్షానికే సైదాపురంలోని బస్టాండ్‌లో పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలుస్తుంది. బస్సులు రాకపోకలు సాగించే సమయంలో మట్టి చేరి బురదమయంగా మారుతోంది. దీంతో ప్రయాణికులు బస్టాండ్‌లోకి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బురద లేకుండా చేయాలని కోరుతున్నారు.


బస్టాండ్‌లో నిలుస్తున్న వర్షపు నీరు


సైదాపురం : కమ్ముకున్న మేఘాలు



ఓజిలి: రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు (ఫైల్), కల్వర్టు నిర్మించాల్సిన ప్రదేశం

వైభవంగా శివపార్వతుల కల్యాణం

రాపూరు: మండలంలోని ఆకలివలస సమీపంలోవున్న బుగ్గేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మాస శివరాత్రిని పురస్కరించుకుని ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. అదేవిధంగా వేపినాపి సమీపంలోని పోతుకొండలో కొలువైన అంకాళపరమేశ్వరికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక పుష్పాలతో పూలంగి సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తలనీలాలు సమర్పించారు. పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా అంకమ్మ కొలుపు మహోత్సవం

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలోని తూర్పువీధిలో ఉన్న అంకాళ పరమేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం కొలుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ప్రత్యేక ముగ్గు వేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

మండలంలోని తురిమెర్లలో వున్న ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం స్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

ముగిసిన నాగార్పమ్మ జాతర

ఓజిలి: ఓజిలి గ్రామంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న నాగార్పమ్మ జాతర ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. గ్రామ పెద్దలు, యువత వీరతాళ్లు చేపట్టారు.

వైభవంగా రాజమునీశ్వర స్వామి ఉత్సవాలు


చిట్టమూరు : మండల పరిధిలోని ఎల్లూరులో ఆదివారం రాజమునీశ్వర స్వామి వార్షిక ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలపోషణ హోమం నిర్వహించారు. స్వామి వారికి చందనాలంకణ చేసి భక్తులకు దర్శనం కలిప్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి స్వామి వారి గ్రామోత్సవం ఆకట్టుకుంది.

ఘనంగా గ్రామదేవతల ఉత్సవాలు

పెళ్లకూరు: మండలంలోని అర్ధమాల, కప్పగుంటకండ్రిగ గ్రామాల్లో ఆదివారం గ్రామదేవతలు వేలూరమ్మ, సముద్రపాలమ్మ ఉత్సవాలను ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రధాన వీధుల్లో చలువ పందిళ్లు వేశారు. ఆలయ అర్చకులు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. డప్పులమోత మధ్య అమ్మవారి ఉత్సవమూర్తులను ఊరేగిస్తూ ఎదురు కుంబాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో అనీల్‌కుమార్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, బాబురెడ్డి, సుబ్బ రామ య్య, నాగేంద్ర, రమేష్‌నాయుడు, కృష్ణయ్య, నాగేంద్రరెడ్డి, ప్రసాద్‌నాయుడు, మదన్‌నాయుడు, మురళీనాయుడు, శేఖర్‌నాయుడు, పరుశురామ్, సిద్దులనాయుడు, చంద్ర, హరినాయుడు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు


చిల్లకూరు : తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని పొంగళ్లు పెట్టారు. ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.


సైదాపురం: ఆంజనేయ స్వామి గ్రామోత్సవం


ప్రత్యేక అలంకరణలో అంకాళ పరమేశ్వరి అమ్మవారు


చిల్లకూరు: విశేషాలంకరణలో ముత్యాలమ్మ


రాపూరు : శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు





ఓజిలి : పొంగళ్లు పెడుతున్న మహిళలు, చిట్టమూరు : అలంకరణలో రాజమునీశ్వర స్వామి, కలపోషణ హోమం చేస్తున్న గ్రామస్తులు, రాపూరు : విశేషాలంకరణలో అంకాళ పరమేశ్వరి

కారు ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలు

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలోని కుల్లూరు జాతీయ రహదారిపై ఆదివారం బైక్‌ను కారు ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం కమ్మవారిపల్లికి చెందిన మద్దల మల్లికార్జున, పోలిరెడ్డి ప్రభాకర్, మద్దెల మయాంక్‌రెడ్డి, కొమ్మి సుధాకర్ బైక్‌లో కుల్లూరు నుంచి కమ్మవారిపల్లికి వెళుతున్నారు. కుల్లూరు జాతీయ రహదారిపై రాపూరు నుంచి ఉప్పలపాడు వైపు వెళుతున్న కారు ఢీకొంది. బైక్‌పై వెళుతున్న నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వారిని స్థానికులు 108లో నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన వారు